

మెహెర్‌బాబా మననము

జి.వి.జి.కె.చంద్రమౌళీశ్వరరావు



వతార్ మెహెర్‌బాబా విజయవాడ సెంటరువారిచే ది 25-5-87న జరిగిన
పూర్వ దర్శనం-5బి." గ్రంథావిష్కరణ చిత్రాలు

1 GVPOIM188 H:-7·4
W:-4·8

మెహెర్‌బాబా మననము

మనం మన మేధా సంపదతో అవతారుని గురించి అవగాహన చేసుకోవటానికి ప్రయత్నించటం అత్యంత దుర్లభమైన విషయం. మరి అవతారుని వైభవాన్ని మనం తెలుసుకోకలగాలంటే ముందు మనమాయనలో సంలీనంకావాలి. మానవాళికి స్వస్వరూప జ్ఞానానుభవాన్నందించేందు కెందరో మహాత్ములు యుగయుగాలుగా ఆధ్యాత్మికతత్వసారాన్నందించటం, మహావాక్య వివరణమునను గ్రహించటం కోకొల్లలుగా వున్నాయి. యుగములుమారినా చెరిగిపోని దివ్యకాంతి ప్రభలు మహామణులై, మత గ్రంధాలుగా విలసిల్లుతూ, ఈ మానవకోటిని అజ్ఞాన తిమిరంనుంచి విముక్తులై శోభిల్లేందుకు దోహదపడుతున్నాయి.

అయినప్పటికీ నామరూపాత్మకమైన ఈ ప్రపంచం, సర్వాధారమైన చిదాకాశమందు మాయచే కల్పితమైనందున ఈ మాయప్రభావం వల్ల భౌతికాకర్షణలకు బందీలై, కనిపించేదే నిజమన్న భ్రాంతితో అసలు సత్యాన్నిమరచి, సంసార దుఃఖాగ్నిలో పరితపించు జీవులకు తరుణోపాయం చూపించే బాధ్యతను భగవంతుడే స్వయంగా తీసుకొని మాటిమాటికి మానవుడై మానవులమధ్య అవతరిస్తూ మేల్కొలుపుగావిస్తూ వుంటాడు.

ఏదైవశక్తివల్ల ఈ జగత్తు సృష్టించబడి, భరించబడుతోందో, యింకా ఏశక్తివల్ల తిరిగి ఈ సకలజగత్తు తనలోనే లయమవుతోందో ఆ దైవమాయగురించి, ఆ అద్భుత దైవశక్తిగురించి ఆచరణాత్మకంగా

వివరించటం అవతారునిగా చేసే కార్యక్రమము. అగుపించేదైవం, అగుపించని దైవానికి మధ్యవుండే సంబంధాన్ని విపులీకరించి, భగవంతుడు, ఆయన సృష్టికిమధ్యవున్న సంబంధాన్ని వివరించటమీకార్యక్రమంలో ప్రధానాంశం. తర్కంతోను వాదంతోను కనపడని భగవంతుని భక్తితో ఎలా సాక్షాత్కారం చేసుకోవచ్చో బోధించి అవతారుడు తనకృపకు పాత్రులయ్యేట్లు మానవ హృదయాల్ని పరిశుద్ధపరుస్తాడు.

ఏదిలేదో అది మాయ. అజ్ఞానం (అవిద్య) మూలంగా మాయ కల్పితమవుతోంది. కంటికి కనిపించని నిర్గుణ బ్రహ్మము (స్వస్వరూపం) నందు కలిగే దేహభ్రాంతి విష్ణుమాయ. భగవంతుడీమాయ చేతనే ఈ జగత్తును నిర్మించి నిశ్చింతగావుంటాడు. యుక్తిచేత మనం దీన్ని నిరోధించలేము. ఆత్మ తత్వజ్ఞానంవల్లనే యిది నశిస్తుంది. ఈ మాయా సంబంధంచేతనే పరమాత్మకు జీవత్వం సంభవిస్తున్నది. మాయ అనిర్వచనీయమైనది. జీవునియందుగల నిద్రారూపమగు అవిద్యాశక్తి కారణమువల్ల స్వప్నంలో ఆకాశగమనము, స్వశిరచ్ఛేదనము, క్షణకాలంలో అనేక సంవత్సర సమూహమును, గతించిన బంధువులను మిత్రులను చూడటంవంటి దుర్ఘటములగు అవిద్యా కార్యములను ఏ ప్రకారం చూడగలమో అదేమాదిరి, ఈ మాయాశక్తి జగత్తుయొక్క సృష్టిస్థితి, సంహారములనే కార్యములు చేస్తున్నది. కలలోకలిగే అనుభవం ఎలా నిజంకాదో, అదేవిధంగా, మాయాకల్పిత సకలసృష్టి స్థితి లయములు నిర్వచింపశక్యం కాదన్న జ్ఞానాన్ని బోధించటం అవతారుని విశ్వకార్యక్రమంలోని అంశం.

దేహ భ్రాంతిలో మునిగివున్న మానవుడ్ని వుద్ధరించేందుకు, మాయామోహంనుంచి విముక్తులై గమ్యం చేరేందుకు భగవంతునియందు

తీవ్రమైన ప్రేమకలిగి వుండటమొక్కటే తరుణోపాయమని మెహెర్ బాబా బోధించారు. నిత్య నిరంతర బ్రహ్మనిష్ఠచేత సత్వరజస్తమో గుణాలు, అహంకార మమకారములు సర్వమూ అతిక్రమించి ఈ జీవితదశయందే మాయనుండి, తత్కార్యమైన సంసారమునుండి విముక్తులై శాశ్వత సుఖాన్నెలా పొందగలరో బాబా చక్కగా తన చిన్మయ చేష్టలద్వారా విశదపరచారు. నీవేమీ చెయ్యక నిశ్చింతగావుండు. అంతా నేనే చూచుకుంటానన్నారు. నావాళ్ళ నెవరిని నానుండి తప్పించుకు పోనివ్వనని అభయమిచ్చారు. పులినోటచిక్కిన జంతువెలా తప్పించుకుపోలేదో అలాగే ఆయన తన అనుగ్రహాన్ని మనకిచ్చి, తననుంచి తప్పించుకుపోలేనట్లు చేశారు.

ఈ జీవితాన్ని ఎంత తరిచినా, అర్థంకాదు. మనస్సులో దైవ చింతనలేకపోతే ఆజీవితం, దుర్భేద్యమైన రహశ్యంగా మిగిలిపోతుంది. మన భారతీయ సంస్కృతికి, హిందూధర్మానికి వేదాలు వెన్నెముక వంటివికాగా బైబిలు క్రిష్టియనులకు, ఖురాన్ మహమ్మదీయులకు జొరదెష్ట జోరాష్ట్రియునులకు జ్ఞానాన్నందించే మహోత్కృష్ట గ్రంథరాజాలై ప్రాముఖ్యత సంతరించుకున్నాయి. ఏమతానికి చెందిన గ్రంథాలైనా యివన్నీ మానవుడు అజ్ఞానాంధకారంనుండి, ఈ జననమరణ సంసార చక్రమునుండి విముక్తి చెందేందుకుపయోగపడే జ్ఞానాన్నందించే, విజ్ఞాన భాండాగారాలే!

మానవ జీవితరహశ్యం ఐహికము, లేక ధార్మికమగు భౌతిక జీవన విధానముతో ముడిపడి వున్నది. జీవితధర్మాలు, భౌతికములు మరియు అంతరికములనే విభాగాలై యున్నవి. మనబుద్ధులు మనస్సులు, వ్యక్తిత్వము, యివన్నీ ప్రత్యేక జీవితపరిస్థితులయందు చిక్కుకొని